సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 5 । జనవరి । 2023



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దెందులూరు: అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి **ఆవిష్కరించారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5 వరకు ఉత్సవాలు జరుగుతాయి.**



వరాహావతార అలంకరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం జనార్థన స్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి **స్వామికి వరాహావతార అలంకరణ చేశారు.**

108 కలశాలతో అభిషేకం



పెనుగొండ: ఇలపర్రులో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం **భారీ అన్న సమారాధన నిర్వహించారు.**

న్యూస్‌రీల్

ఎన్జీజిఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, సంఘ సభ్యులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు కష్టపడి పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం కలెక్టర్ చేతుల మీద జిల్లా ఎన్జీవో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఎన్జీవో సంఘం కార్యదర్శి నెరుసు రామారావు, ఇతర కార్యవర్గ సభ్యులు, జేఏసీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరనాథ్, ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యు.పాండురంగారావు, పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరం కలెక్టరేట్ లో పనిచేస్తున్న ఉద్యోగులు, మహిళా విభాగం జిల్లా కోశాధికారి తోట కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు రుణాలు మంజూరు చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి పశువులు కొనుగోలుకు విరివిగా రుణాలు అందజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో అమూల్ పాల సేకరణకు ఉపయోగపడేలా పశువుల కొనుగోలుకు పాడి రైతులకు రుణాలు అందజేయాలన్నారు. ఇప్పటికే డీఆర్డిఏ ద్వారా శ్రీనిధి నుంచి సుమారు రూ.17 లక్షల పశువులు కొనుగోలుకు రుణాలను మంజూరు చేశామన్నారు. ఇతర జిల్లాల నుంచి నాణ్యమైన పశువుల్ని కొనుగోలు చేయాలని సూచించారు. మొగల్తూరు ప్రాంతంలో మరిన్ని అమూల్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర డైరీలకంటే అమూల్‌లో ఖచ్చితమైన వెన్న శాతాన్ని లెక్కించడంతోపాటు, ఎక్కువ మొత్తాన్ని చెల్లిస్తుందన్న విషయాన్ని విరివిగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఏ పిడి ఎం.ఎస్.ఎస్ వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె .మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి

పెంటపాడు: పొలం పరిసరాల విశ్లేషణ, భాగస్వామ్య కార్యాచరణ పరిశోధనలపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పొలంబడి పరిశీలనలో భాగంగా బుధవారం మండలంలోని ఆకుతీగపాడులో మండల వ్యవసాయాధికారి కె.పార్థసారధి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ వ్యవసాయంలో ఆకుముడత, కాండం తొలుచుపురుగులు ఆశించకుండా జాగ్రత్తలు వివరించారు. మిత్ర పురుగులు నశించిపోకుండా అగ్నేయాస్త్రం తయారు చేసుకొని ఎకరానికి మూడు లీటర్ల ద్రావణం పిచికారీ చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ కైగాల శ్రీనివాస్, గూడెం ఏడీఏ పి.మురళీకృష్ణలు మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖ వివరించే యాజమాన్య పద్ధతులు అవలంబించాలన్నారు. సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మండల వైఎస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, 10 మంది వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న నాలుగు ప్రభుత్వ ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ (హార్టికల్చర్) కోర్సు 2022–23 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం ఎన్ఆర్ఐ, స్పాన్సర్డ్ కేటగిరి కింద దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు బుధవారం పరిపాలన భవనంలో కౌన్సెలింగ్ జరిగింది. ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ మాట్లాడుతూ ప్రక్రియ ముగిసే సమయానికి ఎన్ఆర్ఐ, స్పాన్సర్డ్ కేటగిరి కింద 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు జనవరి 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి అంతర ఉద్యాన కళాశాలల పోటీలు

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యాన కళాశాలలో 10వ అంతర ఉద్యాన కళాశాల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఈ నెల 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు జరగనున్నట్లు విద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి తెలిపారు. పోటీలను ఉపకులపతి డాక్టర్.టి.జానకిరామ్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విశ్రాంత ఐపీఎస్ మల్లారెడ్డి, ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, భారత్ అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఐ.అజయ్ కుమార్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

యువత నైపుణ్యానికి పదును

- ప్రతీ నియోజకవర్గంలో స్కిల్ హబ్..
- యువతకు శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం
- వసతుల కోసం రూ.11 లక్షల చొప్పున కేటాయింపు
- ఏలూరు, పశ్చిమ గోదావరిలో 14 స్కిల్ హబ్‌లు..



తరగతి గదిలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు



ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో గత ప్రభుత్వాలు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ఏ చిన్న ప్రయత్నమూ చేయలేదు. ఎంతోమంది నిరుద్యోగులు తమ అర్హతకు తగ్గ అవకాశాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూడడమే సరిపోయింది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిపోయింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రాష్ట్రంలో నిరుద్యోగులకు పండుగ వాతావరణమే.. రాష్ట్రంలో నిరుద్యోగం అనే మాట వినపడకూడదని జగన్ కంకణం కట్టుకున్నారు. నిరుద్యోగ రహిత సమాజం నిర్మించాలని తపన పడ్డారు. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ పోస్టులను సృష్టించి లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. వేలాది మందికి సచివాలయ కార్యదర్శుల ఉద్యోగాలిచ్చి జగన్‌పై నిరుద్యోగులు పెట్టుకున్న నమ్మకాన్ని, వారు కన్న కలలను నిజం చేశారు. ఇక్కడితో తన బాధ్యత తీరిపోయిందనుకోలేదు ముఖ్యమంత్రి. భవిష్యత్‌లో కూడా ఉద్యోగాల జాతర జరిగేలా కార్యాచరణ రూపొందించారు. కేవలం ఉన్నత చదువులు, డిగ్రీలు చదివిన వారికే కాకుండా 10వ తరగతి, ఇంటర్మీడియట్ వంటి చదువులు చదివి పరిస్థితుల ప్రభావంతో చదువు మధ్యలోనే ఆపేసిన వారు కూడా మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా ఏర్పాట్లు చేశారు. వారిలో వృత్తి నైపుణ్యాలను పెంచి వారు కూడా ఉన్నత ఉద్యోగాలు పొందేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

స్కిల్ హబ్‌లతో ఉద్యోగాల కల్పన

కేవలం ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి కన్న కలలకు ప్రతిరూపాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంది. తక్కువ విద్యార్హతలున్న వారితో పాటు ఉన్నత చదువులు చదివి ఉద్యోగావకాశాలు లభించక నిరుద్యోగ జీవితం గడుపుతున్న యువత కోసం ఈ స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసింది. ఈ స్కిల్ హబ్‌లలో అభ్యర్థులకు డొమస్టిక్ ఎలక్ట్రికల్ సొల్యూషన్స్, ఎకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్స్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, సీఆర్ఎం డొమాస్టిక్ నాన్ – వాయిస్, డొమాస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లంబింగ్ జనరల్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, వెబ్ డెవలపర్ వంటి కోర్సుల్లో అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 14 స్కిల్ హబ్‌లు

ప్రభుత్వ ఆదేశాలతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నైపుణ్యాభివృద్ధి సంస్థల అధికారులు ఈ రెండు జిల్లాల్లో కలిపి 14 స్కిల్ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఏలూరు జిల్లాలో ఏలూరు ప్రభుత్వ డీఎల్‌టీసీ, వట్లూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, చింతలపూడిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, నూజివీడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పోలవరం, కైకలూరుల్లో ప్రత్యేక స్కిల్ హబ్‌లు, భీమడోలులోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలల్లో ఈ స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఆచంట ప్రభుత్వ ఐటీఐ కళాశాల, భీమవరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తణుకులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పాలకొల్లులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, నరసాపురంలోని డీసీసీలో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశారు.

ఒక్కో స్కిల్ హబ్‌కు రూ.11 లక్షల నిధులు

స్కిల్ హబ్‌ల ఏర్పాటుకు, వాటిలో కుర్చీలు, బల్లలు, డెస్క్‌లు, ఫ్యాన్లు, వైరింగ్, సీసీ కెమెరాలు, స్మార్ట్ టీవీ, తాగునీటి సౌకర్యం తదితర సౌకర్యాల కల్పనకు ప్రాథమికంగా రూ.11 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. వీటితో పాటు ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చే ట్రైనర్లకు, పారితోషికం, శిక్షణ పొందే ప్రతీ అభ్యర్థికి రూ.1000 స్టైఫండ్ ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మొదటి విడతలో ఎంపిక చేసిన కోర్సుల్లో శిక్షణ ముగింపు దశకు చేరుకోగా రెండవ దశలో శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తులు చేస్తున్నారు.

2015 మందికి ఉద్యోగాలు

పశ్చిమ గోదావరి జిల్లాలో 2022–23 సంవత్సరంలో 7 జాబ్ మేళాలు నిర్వహించారు. ఆయా జాబ్ మేళాల్లో స్థానిక కంపెనీలతో పాటు బహుళ జాతి సంస్థలనూ ఆహ్వానించి తాము శిక్షణ ఇచ్చిన అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చే ఏర్పాటు చేశారు. ఈ మేరకు జాబ్ మేళాలకు 2396 మంది హాజరు కాగా వారిలో 860 మందికి ఆయా కంపెనీలు ఉద్యోగాలనిచ్చి ప్రోత్సహించాయి. ఏలూరు జిల్లాలో 2022–23 సంవత్సరంలో ఇప్పటి వరకూ 11 జాబ్ మేళాలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాలకు 3201 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 1155 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి.

అంతర్జాతీయ స్థాయిలో..



స్కిల్ హబ్‌ల ద్వారా అభ్యర్థులకు ఉన్నతమైన శిక్షణ అందిస్తున్నాం. ఆయా కోర్సుల్లో శిక్షణ కోసం నిష్ణాతులను అందుబాటులోకి తీసుకొచ్చాం. యువతలోని నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా స్కిల్ హబ్‌లు పనిచేసేలా చర్యలు తీసుకున్నాం. ఎంప్లాయిమెంట్ శాఖ, సీడాప్ నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నాం.

– ఈ.తమ్మాజీ రావు, ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

శుభపరిణామం



ఇప్పటికే నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన ఎంతోమంది అభ్యర్థులు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందారు. తక్కువ విద్యార్హతలు ఉన్నవారికి సైతం బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు రావడం శుభపరిణామం. చుట్టుపక్కల రాష్ట్రాల్లోని కంపెనీలు సైతం మా వద్ద శిక్షణ పొందిన అభ్యర్థులను ఎంపిక చేసుకోవడానికి ముందుకు వస్తున్నాయి.

– అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

నరసాపురంలో కలెక్టర్ తనిఖీలు



ఎస్ఎన్ఎస్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

నరసాపురం: నరసాపురం పట్టణంలో కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. వార్డు సచివాలయాన్ని తనిఖీచేసి ఉద్యోగులతో మాట్లాడారు. ఓ పాఠశాలలో మధ్యాహ్న భోజనం స్వయంగా రుచిచూసి సూచనలు ఇచ్చారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలతో అధికారులు పరుగులు పెట్టారు. ఎస్ఎన్ఎస్ హైస్కూల్‌కు సంబంధించి ఫేజ్–2 నాడునేడు కార్యక్రమంలో జరుగుతున్న పనులు పరిశీలించారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తికావాలన్నారు. అదే పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని 7వ వార్డులో ఉన్న సచివాలయాన్ని ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీచేశారు. సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన ఉండేలా చైతన్య నింపాలని చెప్పారు. సచివాలయ రికార్డులను, అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డీఈవో ఆర్.వెంకటరమణ, తహసీల్దార్ ఎండీ ఫాజిల్, ఎంపీడీవో శివప్రసాద్‌యాదవ్, ఉన్నారు.

చంద్రబాబు అధికార దాహానికి బలి

మంత్రి కారుమూరి ఫైర్

ఇరగవరం: చంద్రబాబు శవాల మీద పేలాలు ఏరుకునే రకమని రాష్ట్ర పౌర సరాఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో విద్యుత్ ఘాతం వల్ల దివ్యాంగుడిగా మారిన అయినవిల్లి రాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్కును బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గతంలో కొంతమంది నాయకులు రూ.5 వేలు సాయం అందించి చేతులు దులుపుకున్నారని, తను స్వయంగా ఫైల్ పట్టుకుని సీఎం వద్దకు వెళ్లి అతని పరిస్థితిని వివరించానని తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ. 10 లక్షల చెక్కు ఇచ్చారని చెప్పారు. చంద్రబాబు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆయన చనిపోయిన తర్వాత ముఖ్యమంత్రి అయ్యి శవాల మీద రాజకీయం చేసిన వ్యక్తి అని విమర్శించారు. ఉండ్రాజవరం మండలం కాల్దారిలో రైతులను కాల్పించాడని, చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజున 8 మంది విద్యార్థులు నదిలో కొట్టుకుపోయారని, అతని పబ్లిసిటీ పిచ్చితో పుష్కరాల్లో 29 మందిని చంపాడని విమర్శించారు. కుందుకూరులో 8 మంది చావుకు కారణమయ్యాడని, గుంటూరులో ముగ్గురు మహిళలను బలి తీసుకున్నాడని విమర్శించారు. తన అధికార దాహానికి అనేక మందిని బలితీసుకొని శవరాజకీయాలు చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని ఫైర్ అయ్యారు. చిన్న వయస్సులో ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మనసున్న వ్యక్తి అని అన్నారు. చంద్రబాబు పరిపాలనలో ఒక సెంటు భూమి కూడా కొని ప్రజలకు ఇవ్వలేదని.. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన మూడున్నర సంవత్సరాలలో 55 వేల కోట్లతో లక్ష ఎకరాలు కొని 25 లక్షలమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని అన్నారు. గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న ఆకుమర్తి సన్నికి 5 వేలు, మెరిపే మరియమ్మ అనే వృద్ధురాలుకు 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైస్ ఎంపీపీ మల్లిడి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మండల సేవాదళ్ కన్వీనర్ జవ్వాది సురేష్ తదితరులు పాల్గొన్నారు.




కత్తవపాడులో రూ.10 లక్షల చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సీఎస్ఆర్ నిధులపై సమీక్ష

ఏలూరు(మెట్రో): జిల్లాలోని పరిశ్రమల ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సీఎస్ఆర్ నిధులు అందజేసి జిల్లా అభివృద్ధికి సహకరించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ఆర్ నిధుల పర్యవేక్షణ కమిటీని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు సీఎస్ఆర్ ఫండ్ అందజేయడం ద్వారా జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో ఉన్న ఆయా పరిశ్రమల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద గత మూడు సంవత్సరాలలో వినియోగించిన నిధులతో నిర్వహించిన కార్యకలాపాలను ఆయా పరిశ్రమల వెబ్‌సైట్లలో పొందుపరచాలన్నారు. సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేశామని చెబుతున్న యాజమాన్యాలు వాటిని భౌతికంగా కనిపించేలా చూపాలన్నారు. ఎక్కువ మొత్తంలో టర్నోవర్ గల పరిశ్రమలు తమ వార్షిక ఆదాయంలో రెండు శాతం నిధులను సీఎస్ఆర్ ఫండ్స్‌కు కేటాయించవలసి ఉందన్నారు. నాడు–నేడు కింద చేపడుతున్న పనులలో మౌలిక సదుపాయాలకు అవసరమైన వివరాల జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పరిశ్రమ నిర్వహణకు జిల్లా యంత్రాంగం సహకారం అందిస్తుందని చెప్పారు. పరిశ్రమల కేంద్రం జీఎం పి.ఏసుదాసు పాల్గొన్నారు.

భీమవరం–పిప్పర రోడ్డుకు మహర్దశ

- రూ.15 కోట్లతో భీమవరం–యండగండి రోడ్డు అభివృద్ధి
- యండగండి నుంచి పిప్పరకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు



భీమవరం నుంచి గొల్లలకోడేరు వరకు అభివృద్ధి చేసిన రోడ్డు



భీమవరం నుంచి యండగండి వరకు రోడ్డు విస్తరణ దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం–పిప్పర రోడ్డుకు మంచి రోజులు వచ్చాయి. సుమారు రూ. 25 కోట్లుతో నిర్మించే రోడ్డుకు ఇప్పటికే రూ.15 కోట్లు మంజూరుకాగా భీమవరం నుంచి యండగండి వరకు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. యండగండి నుంచి పిప్పర వరకు ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో నిర్మించడానికి రూ.10 కోట్ల వ్యయం అవుతుందని అంచనావేసి ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లడానికి గరగపర్రు, యండగండి, పిప్పర ప్రధాన రహదారి. ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వరకు గతంలో రోడ్డును అభివృద్ధి చేసినా భీమవరం నుంచి పిప్పర వరకు రోడ్డు గోతులు మయంగా మారింది. ఎంతో ప్రాధాన్యత కలిగిన రోడ్డును గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పెద్ద పెద్ద గోతులు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో రోడ్డుపై గోతులు చెరువులను తలపించేలా ఉండేవి. దీంతో భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే ప్రయాణికులు ఉండి, గణపవరం మీదుగా ప్రయాణించేవారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం భీమవరం–పిప్పర రోడ్డు అభివృద్ధిపై దృష్టిపెట్టింది. గత ఏడాదే భీమవరం నుంచి యండగండి వరకు రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించినా ఎడతెరపిలేని వర్షాల కారణంగా పనులు ముందుకు సాగలేదు.

యండగండి వరకూ చురుగ్గా పనులు

భీమవరం నుంచి యండగండి వరకు సుమారు 12 కిలోమీటర్లు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరుచేసింది. రోడ్డును రెండువైపులా విస్తరించి పటిష్టంగా నిర్మించడానికి పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే భీమవరం నుంచి గొల్లలకోడేరు వరకు పనులు పూర్తిచేశారు.

రూ.10 కోట్లతో ప్రతిపాదనలు : యండగండి నుంచి పిప్పర వరకు 7 కిలోమీటర్ల రోడ్డును ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో అభివృద్ధి చేయడానికి ఆర్ అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోడ్డుకు ఒక వైపున యనమదుర్రు కాలువ ఉండడంతో రోడ్డు నిత్యం కుంగిపోయి ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రోడ్డును మరింత పటిష్టంగా నిర్మించడానికి రూ.10 కోట్లు అవుతుందని ఆ మేరకు నిధులు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీనిపై కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక దృష్టిపెట్టడంతో త్వరలోనే నిధులు మంజూరై పనులు చేపట్టే అవకాశముంది. అప్పటి వరకు రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈరోడ్డు పనులు పూర్తయితే భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పినట్లే.

ముమ్మరంగా రోడ్డు పనులు



భీమవరం నుంచి యండగండి వరకు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొన్నటి వరకు వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పటికే గొల్లలకోడేరు వరకు పనులు పూర్తికాగా మిగిలిన పనులు వేగంగా సాగుతున్నాయి. యండగండి నుంచి పిప్పర వరకు ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మించడానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

– ఎస్.లోకేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, భీమవరం

శ్మశాన వాటికలకు భూసేకరణ చేపట్టాలి

జాయింట్ కలెక్టర్ మురళీ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ మురళీ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో శ్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ జేవీ మురళి పలు రెవిన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశాన వాటికల ఏర్పాటుకు ఇప్పటికే గ్రామాల్లో గుర్తించిన భూమిని ఎస్సీ వర్గాల శ్మశాన వాటికల ఏర్పాటు నిమిత్తం పంచాయతీలకు తీర్మానాలను పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిగతా వర్గాలకు అవసరమైన భూమిని గుర్తించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పేదల ఇళ్ల పట్టాల మంజూరుకు సంబంధించి కోర్టు కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నర్సాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, భీమవరం ఆర్డీఓ దాసిరాజు, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి పంట బోదెలో పడి వ్యక్తి మృతి



వెలగలేరులో పంటబోదెలో ఉన్న దుర్గారావు మృతదేహం, బైక్ , దుర్గారావు (ఫైల్)

పెనుమంత్ర: బైక్ అదుపుతప్పి పంటబోదెలోకి వెళ్లడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన జుత్తిగ వెంకట కనక దుర్గారావు (62) ఆలమూరు గ్రామంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ వల్లూరు నుంచి ఆలమూరుకు బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. ఎప్పటి లాగానే బుధవారం ఉదయం ఐదు గంటల ప్రాంతాల్లో ఆలమూరుకు బైక్‌పై బయలుదేరాడు. వెలగలేరు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి పంటకాలువలోకి పడిపోగా దుర్గారావు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దుర్గారావుకు పదేళ్ల క్రితం బైపాస్ సర్జరీ జరగ్గా, బండి నడిపే సమయంలో గుండెపోటు రావడంతో బండి అదుపుతప్పి పంటకాలువలో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. స్థానికులు అందించిన సమాచారంతో ఎస్సై బి.సురేంద్రకుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవుడి భూములకు మంచిరోజులు

- జగనన్న శాశ్వత భూహక్కులో దేవదాయ శాఖ భూముల సర్వే
- పశ్చిమలో ఆక్రమణలో 301 ఎకరాలు



భీమవరం(ప్రకాశం చౌక్) : జగనన్న శాశ్వత భూహక్కు సర్వేతో దేవుడు మాన్యాలకు మంచి రోజులు వచ్చాయి. ఏళ్ల తరబడి ఆక్రమణదారుల చెరలో ఉన్న దేవస్థానాల భూములు రీ సర్వే ద్వారా ఆక్రమణ చెర నుంచి విడుదలవుతున్నాయి. పూర్వం నుంచి ఆలయాలకు దానం ఇచ్చిన భూములను దేవదాయ శాఖ ఆలయ అర్చకులు సాగుకు ఇచ్చారు. ఈ భూములను సరిహద్దుదారులు, కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు ద్వారా సర్వే చేసిన నాటి రికార్డుల ప్రకారం వాస్తవ భూముల్ని వెలికి తీసి దేవదాయ శాఖ రికార్డుల్లోకి ఎక్కించి ఆన్‌లైన్ చేస్తున్నారు. అందులో భాగంగా నూతన పశ్చిమగోదావరి జిల్లాలో దేవదాయ శాఖకు చెందిన భూముల సర్వే జరుగుతోంది.

జిల్లాలో 8095 ఎకరాల దేవదాయ భూముల సర్వే

జిల్లాలో దేవదాయ శాఖకు సంబంధించి 8095.74 ఎకరాల భూములున్నాయి. సాధారణ భూములతో పాటు ఈ భూములను కూడా సర్వే చేస్తున్నారు. జిల్లాలోని 19 మండలాల్లో ఉన్న దేవదాయ భూముల సర్వే నెంబర్లు, విస్తరణతో కూడిన వివరాలను తహసీల్దారుకు దేవదాయ శాఖ అధికారులు అందించారు. ప్రాపర్టీ రిజిస్టర్ సెక్షన్ల ఆధారంగా భూముల వివరాలతో పాటు పాత ఎఫ్ఎంబీ, ఆర్ఎస్ఆర్‌లను పరిశీలిస్తూ భూములను సర్వే చేసి రికార్డుల్లోకి ఎక్కిస్తున్నారు.

ఆక్రమణ చెరలో 301.81 ఎకరాలు

జిల్లాలో 8095.74 ఎకరాల దేవదాయ శాఖ భూములు ఉండగా అధికారుల లెక్కల ప్రకారం 301.81 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి దేవదాయశాఖ రికార్డుల ప్రకారం సర్వే చేసి ఆక్రమణలోని భూముల్ని తిరిగి దేవదాయ శాఖకు అప్పగించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో సుమారు 200 మంది అర్చకులకు అనువంశికంగా ఇచ్చిన భూములు 1282.30 ఎకరాలున్నాయి. వాటిని కూడా పూర్తి స్థాయిలో సర్వే చేసి రికార్డుల్లో భద్రపరిచే కార్యక్రమం చేస్తున్నారు. భూముల ద్వారా ఏడాదికి రూ.20.09 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభిస్తోంది.

జిల్లాలో అధిక భూములు కలిగిన దేవస్థానాలు ఇలా

దేవస్థానం	ప్రాంతం	భూములు ఎకరాల్లో	ఆదాయం రూ.లక్షల్లో
భైరాగి మఠం	పెంటపాడు	356.77	97.27
వెంకటేశ్వరస్వామి	కాళ్లకూరు	87.20	31.50
వెంకటేశ్వరస్వామి	భీమవరం	45.11	10.37
సోమేశ్వరస్వామి	భీమవరం	22.69	35.00
శ్రీ మావుళ్లమ్మవారు	భీమవరం	9	4.00
మదనగోపాలస్వామి	బల్లిపాడు	135.88	57.36
రామేశ్వరస్వామి	నత్తారామేశ్వరం	78.78	34
నగరేశ్వరస్వామి	పెనుగొండ	51.74	22.20
క్షీరా రామలింగేశ్వరస్వామి	పాలకొల్లు	70.11	8.63
రామేశ్వరస్వామి	ఆచంట	134.27	57.36

రీ సర్వేతో దేవస్థాన భూములకు రక్షణ



ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే ద్వారా దేవదాయ శాఖ భూములను సైతం రీ సర్వే చేస్తున్నాం. దీంతో దేవస్థాన భూములకు రక్షణ కలుగుతుంది. ఆక్రమణకు గురైన భూములు సైతం తిరిగి దేవదాయ శాఖకు చెందేలా చర్యలు తీసుకుంటాం. ఈ సర్వేలో దేవదాయశాఖ భూములు సరిహద్దులతో సహా నూతనంగా ఆన్‌లైన్ ద్వారా రికార్డుల్లోకి ఎక్కిస్తాం.

యర్రంశెట్టి భద్రాజీ, జిల్లా దేవదాయ శాఖ అధికారి

పొగాకులో చీడపీడలను నివారించుకోండి


జంగారెడ్డిగూడెం వర్జీనియా-1వ వేలం కేంద్రం పరిధిలో పొగాకు పంటను పరిశీలిస్తున్న ఫీల్డ్ ఫ్రెండ్‌టీమ్

జంగారెడ్డిగూడెం: పొగాకు సాగులో సస్యరక్షణ చర్యల ద్వారా చీడపీడల నుంచి రక్షణ పొందవచ్చని వర్జీనియా పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రాల పరిధిలోని మార్కండేయపురం, బుట్టాయగూడెం, సూరప్పవారిగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల్లో వర్జీనియా పొగాకుబోర్డు ఏర్పాటు చేసిన ఫీల్డ్ ఫ్రెండ్ టీమ్ బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా వర్జీనియా పొగాకు తోటల్లో లద్దెపురుగు, మానుకుళ్లు, మొజాయిక్ వైరస్, పొటాష్ యం లోపం తదితర సమస్యలను గుర్తించామన్నారు. లద్దె పురుగు నివారణకు ప్రొక్లెయిమ్ 5గ్రా మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పొటాషియం లోపం అధిగమించేందుకు ఎకరాకు 25 కేజీల ఎస్‌వోపీ చల్లాలన్నారు. తెల్లదోమ నివారణకు అక్టారా 2 గ్రాముల మందును 10 లీటర్ల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాగా పొగాకులో నూతన పద్ధతులైన మల్చింగ్, డ్రోన్ సాంకేతికతను కొంతమంది రైతులు వినియోగిస్తున్నారని, ఈ సందర్భంగా ఆయా పద్ధతుల్లో వేసిన పంటలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం-1వ వేలం కేంద్రం నిర్వహణ అధికారి బి.శ్రీహరి, సీనియర్ గ్రేడింగ్ అధికారి కె.సుధీర్, ఫీల్డ్ అధికారి ఏకే దాసు, ఐటీసీ కంపెనీ ప్రతినిధి చారువక, జీపీఐ కంపెనీ ప్రతినిధి రవి, పీఎస్ఎస్ కంపెనీ ప్రతినిధి నాగేంద్ర, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తీరప్రాంత భూములు అన్యాక్రాంతం కానివ్వొద్దు


కేపీపాలెం బీచ్‌లో ఇటీవల తొలగించిన దుకాణాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మొగల్తూరు : తీర ప్రాంతం ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కేపీ పాలెం బీచ్‌లో అనుమతి లేకుండా కట్టిన శాశ్వత కట్టడాలను తొలగించిన ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. అనుమతి లేకుండా సీఆర్‌జెడ్ భూముల్లో ఎవరైనా అనుమతి లేకుండా కట్టడాలు నిర్మిస్తే వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నరసాపురం మండలంలోని బియ్యపుతిప్ప తీరప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో గతంలో ఎన్ని వందల ఎకరాల్లో మడ అడవులు ఉండేవి, ప్రస్తుతం ఎన్ని ఎకరాల్లో విస్తరించి ఉన్నాయనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, నరసాపురం, మొగల్తూరు తహసీల్దార్లు ఎం.ఫాజిల్, జి.అనిత కుమారి, ఎంపీడీఓ ఎస్.శివప్రసాద్ యాదవ్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లావాసి మృతి

కాళ్ల: పెదఅమిరం గ్రామ పరిధిలో ఉండి రోడ్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా వెల్లంపల్లి గ్రామానికి చెందిన నూతలపాటి వెంకటేశ్వర్లు (52) కొంతకాలంగా భీమవరంలో ఉంటూ ఆకివీడులోని ఓ రొయ్యల కంపెనీలో పనిచేస్తున్నాడు. రోజూ భీమవరం నుంచి బైక్‌పై ఆకివీడు వెళ్లి తిరిగొస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం బైక్‌పై ఆకివీడు వెళ్లి తిరిగి భీమవరం వస్తుండగా, పెదఅమిరం ప్రాంతంలోకి వచ్చేసరికి రోడ్డుపై తీవ్రగాయాలతో స్థానికులకు కనిపించాడు. వెంటనే అతనిని 108 వాహనంలో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి కుమారుడు వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై ఎస్ఈబీ దాడి

ఏలూరు టౌన్: ఎస్ఈబీ సీఐ ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు మండలం చొదిమెళ్ల గ్రామంలో పేకాట శిబిరంపై బుధవారం రాత్రి దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.14,510 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ నిందితులను అప్పగించారు.

యానాం మద్యం పట్టివేత


గొల్లపల్లిలో పోలీసులు పట్టుకున్న యానాం మద్యం సీసాలు, నిందితులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన యానాం మద్యం సీసాలను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఆర్.అంకబాబు, రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ నేతృత్వంలో బుధవారం గొల్లపల్లిలోని కంచర్ల సాయిబాబా ఇంటిపై దాడి చేసి ఇంటి ఆవరణలోని గడ్డివాములో అక్రమంగా దాచిన యానాంకు చెందిన మద్యం సీసాలను గుర్తించారు. రూ.85 వేలు విలువ చేసే 195 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన వంగల రమాదేవి, అడపా శ్రీనివాసరావు యానాంలో కొనుగోలు చేసి గొల్లపల్లికి చెందిన కంచర్ల సాయిబాబా ఇంటి వద్ద దాచారు. వీటిని సంక్రాంతికి కోడిపందేలు, ఇతర ఫంక్షన్లలో అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి, వారు వినియోగించిన కారును సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ చెప్పారు.

బైక్ నుంచి జారిపడి కూలీ మృతి


మృతుడు జోసెఫ్‌రాజు

నరసాపురం రూరల్ : బైక్‌పై వెళుతూ జారిపడటంతో ఓ కూలీ తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కె.బేతపూడికి చెందిన టి.శ్రీరాములు, విప్పర్తి జోసెఫ్ (50) కూలీలు. మంగళవారం రాత్రి వెంప గ్రామానికి బైక్‌పై వెళ్లి తిరిగొస్తున్నారు. శ్రీరాములు బైక్ నడుపుతుండగా, జోసెఫ్ వెనక కూర్చున్నాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమవరం మండలం పెదగరువులోని ఎస్సార్ కళాశాల సమీపంలో బైక్ నిర్లక్ష్యంగా నడపడంతో జోసెఫ్ బండి పైనుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. జోసెఫ్ మృతికి శ్రీరాములే కారణమంటూ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ప్రియకుమార్ చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే చింతమనేనిపై కేసు నమోదు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఐదు సెక్షన్లతో కేసు నమోదు చేశామని ఎస్సై ఐ.వీర్రాజు చెప్పారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభాకర్‌ను ప్రభుత్వాసుపత్రి నుంచి పెదవేగి తరలిస్తుండగా సోమవరప్పాడు బైపాస్ వద్ద జీపు దిగి విధుల్లో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగించి వెళ్లిపోయారన్నారు. ఈ విషయాన్ని వెంటనే జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మకు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జీపు డ్రైవర్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్ ఫిర్యాదు మేరకు దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 2/23తో 341, 24, 506, 353, రెడ్ విత్ 149 సెక్షన్లతో చింతమనేని ప్రభాకర్‌పై ఈ నెల 2న కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

ఈఓపీఆర్డీ తీరుపై డీపీవో విచారణ

కైకలూరు: ఉన్నతాధికారులకు చెల్లించాలంటూ ఆయా పంచాయతీల నుంచి సొమ్ములు వసూలు చేశారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీపీఓ అన్నామణి బుధవారం కైకలూరు పంచాయతీ కార్యాలయంలో ఈ వ్యవహారంపై విచారణ చేశారు. ఇన్‌చార్జి డీపీవో పలు అంశాలకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ వి.రవిశంకర్ నుంచి వివరణ తీసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

ఇంటింటా ఆదరణ


పెనుగొండ (ఆచంట) : ఆచంట మండలం కొడమంచిలిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు


ఆకివీడు : ఆకివీడు మూడో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

- స్నానం కోసం వెళ్లి కాలు జారి చెరువులో పడిన బాలుడు
- అతన్ని రక్షించేందుకు నీటిలోకి దూకిన మరో ఇద్దరు
- క్షేమంగా బయటపడిన బాలిక.. కొత్తూరులో ఘటన


సంఘటనా స్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు


జాన్ మృతదేహాన్ని తీసుకొస్తున్న యువకుడు


కొత్తూరులో చిన్నారులను బలిగొన్న చెరువు


మృత్యువు నుంచి బయటపడిన సునీత

తాడేపల్లిగూడెం రూరల్: స్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందగా, మరో బాలిక క్షేమంగా బయటపడింది. మండలంలోని కొత్తూరులో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలం సూర్యారావుపేటకు చెందిన సంచార జాతులకు చెందిన సుమారు నాలుగు కుటుంబాలు మేకలను మేపుకుంటూ, పిట్టలను పట్టి విక్రయిస్తూ జీవిస్తుంటారు. ఈ క్రమంలో మండలంలోని కొత్తూరు గ్రామానికి చేరుకున్నారు. స్థానిక సచివాలయం సమీపంలో నివాసాల్లో ఉంటున్నారు. బుధవారం ఈ కుటుంబాలకు చెందిన అబ్బసాని కుమారి (13), అబ్బసాని జాన్ (5), అబ్బసాని సునీత (13) కలిసి సమీపంలో ఉన్న చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. చెరువులోకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జాన్ కాలు జారి చెరువులో పడిపోయాడు. అతనిని రక్షించేందుకు కుమారి, సునీతలు కూడా కేకలు వేస్తూ చెరువులోకి దూకేశారు. చిన్నారుల కేకలను విని సమీపంలో నివాసముంటున్న వారి బంధువులు అక్కడకు చేరుకున్నారు. ఓ గెడ బొంగు సాయంతో సునీతను ఒడ్డుకు చేర్చారు. అయితే కుమారి, జాన్‌లు చెరువులో మునిగిపోయారు. చెరువు 20 అడుగుల పైబడి లోతు ఉండటం, అక్కడున్న వారికి ఈత రాకపోవడంతో చెరువులో దూకేందుకు సాహసించలేదు. ఈలోగా గ్రామంలోని కొంత మంది యువకులు ముందుకొచ్చి చెరువులోకి దూకారు. అయితే లోతు ఎక్కువగా ఉండటంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది జేసీబీ సాయంతో చెరువుకు ఇరువైపులా గండ్లు కొట్టి నీటిని బయటకు మళ్లించారు. అప్పటికే కుమారి మృతదేహాన్ని యువకులు గుర్తించి బయటకు తీసుకొచ్చారు. చెరువులో నీరు తగ్గిన తర్వాత జాన్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. దీంతో మృతుల కుటుంబాల్లోనూ, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒకేసారి ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. సమాచారం అందుకున్న ఫైర్, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకోగా యువకులకు సహాయ, సహకారాలు అందించారు. కాగా, మృతులు కుమారి ఏడవ తరగతి చదువుతుండగా, జాన్ ఇంటి వద్దే ఉంటున్నాడు. రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి మార్చిలో చలో అసెంబ్లీ



భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గపూర్ తదితరులు

సాక్షి, భీమవరం : కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చిలో చలో అసెంబ్లీ నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ చెప్పారు. భీమవరంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభల సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు, జీతభత్యాలు పెరుగుదల, వేధింపులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి చలో అసెంబ్లీ కార్యక్రమం తలపెట్టామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కోడ్‌లుగా మార్చిందని వీటిద్వారా యజమానులకు కొమ్ముకాస్తూ కార్మికులను ఎటువంటి హక్కులు లేకుండా చేస్తోందన్నారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడున్నర లక్షల పైగా మహిళలు స్కీం వర్కర్లుగా ఉన్నారని వారిపై పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. మహిళా కార్మికులకు సెలవులు,మెటర్నిటీ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు.. ఆనందం రెట్టింపు

ఇరగవరం : పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంపుదల, సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షనేత చంద్రబాబు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఓడిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని, ఈ ప్రభుత్వ హాయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ఏప్రభుత్వంలైనా చేశారా అని ప్రశ్నించారు. అర్హులైన వారందరికీ పింఛన్ ఇవ్వాలన్నదే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. పేద విద్యార్థులు, బాగా చదువుకోవాలని, నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో సమూల మార్పులు చేసి మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, కె.ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకుల శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు కర్రి సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు మంగెన రామానాయుడు, ఎంపీడీవో బివిఎస్ఎస్ కృష్ణ మోహన్, తహసీల్దార్ బి.మాలతి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. సీఎం పరిపాలన ఎలా ఉందని సభలో ఉన్నవారిని అడగగా పలువురు మహిళలు క్రింది విధంగా స్పందించారు.


ఇరగవరంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఆర్థిక అండ


ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ సొమ్ము పెంచడంతో మాకు ఆసరా పెరిగింది. ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి ఇవ్వని విధంగా సీఎం జగన్ పింఛన్ సొమ్ములు అందజేస్తున్నారన్నారు. మాలాంటి వారికి ఎంతో అండగా ఉంటున్నారు.

– రెల్లి నాగమణి, వృద్ధురాలు

రుణపడి ఉంటాం


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ పెంచుతూ రూ.3వేలు చేస్తానని ప్రకటించారు. ఆదేవిధంగా ఈ ఏడాది రూ.250పెంచడం ఆనందంగా ఉంది. పింఛన్ ఏ విధమైన ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– దాకే లిల్లి పుష్ప కుమారి, రేలంగి, బొబ్బరాజుపాలెం

ఆనందంగా ఉంది


చాలా ఆనందంగా ఉంది. నేడు సీఎం జగన్ పుణ్యమా అని ఏటా పింఛన్ డబ్బులు పెంచుతూ ఈనెల రూ.2750లు ఇచ్చాడు. ఆయనకు మాబోటి పేదళ్లం ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– వెంకట లక్ష్మి, తూర్పు విప్పర్రు

అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిలీ

ఇరగవరం: అంధుల జీవితాల్లో వెలుగు నింపిన మహానీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఎంఈవో ఎస్. శ్రీనివాసరావు అన్నారు. ఇరగవరం మండల భవిత కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లూయిస్‌బ్రెయిలీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ లిపి సృష్టించిన బ్రెయిలీ లిపీ ద్వారా ఎంతో మంది అంధులు చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడ్డారన్నారు. ఎ విటమిన్‌తో ఉన్న పోషక ఆహారం ప్రతి రోజూ తమ పిల్లలకు ఇవ్వడం వల్ల కంటికి సంబంధించిన సమస్యలు ఎటువంటివి రావని అంధత్వాన్ని నివారించువచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె. సత్యనారాయణ, ఉపాధ్యాయులు పి. తులసి, గోపాలకృష్ణ, కె. రమా విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.



లూయా బ్రెయిలీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఘనంగా లూయా బ్రెయిలీ జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ లూయా బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువనేత కొట్టు విశాల్ లూయా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివ్యాంగుల విద్యార్థులచే కేక్ కటింగ్ జరిగింది. వివిధ పోటీలలో నెగ్గిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దివ్యాంగుల పిల్లలకు టిఫిన్ బాక్స్‌లు, స్నాక్స్, నోట్ బుక్స్, పలకలు, డ్రాయింగ్ బుక్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య, సుబ్బారావుపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జ్యోతి, వట్టిప్రోలు రాము, బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భవిత దివ్యాంగుల పిల్లలకు ఉపకరణాలు అందజేత

భవిత దివ్యాంగుల పాఠశాల ఆవరణలో ఈ నెల 5వ తేదీ గురువారం ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్యామ్ సందర్, మండల విద్యాశాఖ అధికారి పి.హనుమ ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు, ట్రై సైకిళ్లు, సీపీ చైర్స్, రోలేటర్స్, వినికిడి యంత్రాలు, వీల్ ఛైర్స్, సంక కర్రలు అందజేస్తారని ఉపాధ్యాయుడు ఎస్‌కే బాలీశ్వరయ్య వెల్లడించారు.

టిడ్కో గృహాలకు వేగంగా రిజిస్ట్రేషన్లు

సాక్షి, భీమవరం: టిడ్కో లబ్ధిదారులకు ఇప్పటికే 2 వేల గృహాలను అప్పగించామని, మిగిలిన వాటినీ త్వరలోనే అప్పగిస్తామని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నామ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. టిడ్కో అధికారులతో బుధవారం సాయంత్రం ఆయన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. లక్ష్యం మేరకు లబ్ధిదారులకు అన్ని వసతులతో గృహాలను అప్పగిస్తున్నామన్నారు. ప్రస్తుతం వాడుకపు నీటిని శుద్ధి చేసే ఎస్‌టీపీ ట్యాంకు పనులు పూర్తయ్యాయని, మిషనరీ బిగించాల్సి ఉందని అన్నారు. ఎస్ఈ బి.శ్రీనివాస్, ఈఈ స్వామి నాయుడు, డీఈ నాగేశ్వరి, ఏఈ బి.పూర్ణచంద్ర కుమార్, ఎల్‌అండ్‌టీ యోగనాథ్ పాల్గొన్నారు.


టిడ్కో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఓహెచ్‌బీఆర్‌ల మంజూరు

భీమవరం నియోజకవర్గంలో మంచినీటి సమస్య తలెత్తకుండా వాటర్ గ్రిడ్ పథకంలో వీరవాసరం, భీమవరం మండలాలకు నాలుగు ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు (ఓహెచ్‌బీఆర్) మంజూరయ్యాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. వీటి నిర్మాణంపై బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ గ్రిడ్ పథకం ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నరసాపురంలో శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. భీమవరం, వీరవాసరం మండలాల్లో రెండు చొప్పున ఓహెచ్‌బీఆర్ నిర్మించేందుకు స్థలాలు గుర్తిస్తున్నామన్నారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ పథకంలో రెండు మండలాలకు రూ.21 కోట్లు మంజూరు కాగా పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని శ్రీనివాస్ వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.ధనానంద్, జేఈ కనకరావు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణరాజు

పాలకోడేరు: మండల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం ఎంపీడీఓ మురళీ గంగాధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెల్లడించారు. ఎంపీపీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై అవగాహన కల్పించాలి

వివిధ శాఖలతో నిర్వహించిన సమీక్షలో పంచాయతీ విస్తరణ అధికారి వి.రెడ్డియ్య మాట్లాడుతూ జనవరి 26 నుంచి అమలయ్యే ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మోగల్లు, శృంగవృక్షం గ్రామాల్లో డంపింగ్ యార్డ్‌ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఎస్ నరేష్, కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డీఆర్ స్వర్ణలత, ఎంపీటీసీలు కాటూరి శాంతకుమారి, తహసీల్దార్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఏఈ విజయ్ కుమార్ రాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ ఎం.శ్రీనివాస్ యాదవ్, వేగేశ్న పార్వతి, పంచాయతీ సర్పంచ్లు బొల్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనాలు అభివృద్ధి చేయాలి

పెనుగొండ: ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసి శిథిలమైన ఎస్సీ కమ్యూనిటీ భవనాలను అభివృద్ధి చేయాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సరేళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం నడిపూడిలో మాలమహానాడు సమావేశం నిర్వహించి గ్రామ ఉపాధ్యక్షుడిగా కుసుమే వెంకటేశ్వరరావు, యూత్ అధ్యక్షుడిగా గెడ్డం రాజుకుమార్‌లను నియమించి నియామక పత్రాలు అందించారు. ఆచంట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు రొక్కాల విజయగాంధీ, పి.విజయకుమార్, జి.సురేష్, కె.ఆనంద్, కె.రవికుమార్, కె.అఖిల్, తదితరులు పాల్గొన్నారు.


నడిపూడిలో మాలమహానాడు కమిటీ నియామక పత్రాలు అందిస్తున్న సరేళ్ల

14నుంచి మహంకాళమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో శ్రీదేవి మహంకాళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఈనెల 14 నుంచి ప్రారంభిస్తున్నట్లు నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ సభ్యులు నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని కొబ్బరితోటలో వెలసిన అమ్మవారి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు మాట్లాడుతూ శ్రీదేవి మహంకాళమ్మ అమ్మవారి ఉత్సవాలను ఈనెల 14వతేదీ నుంచి 23వతేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామన్నారు. అమ్మవారి ఉత్సవాలను నిరంతరాయంగా 43 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ సభ్యులు శీతాళం ఏడుకొండలు, ఈతకోట రామయ్య, వెలనాటి సత్తిబాబు, ముక్కు సత్యనారాయణ, యార్నాల సూరిబాబు, ఈతకోట హరిప్రసాద్, కొర్లేపర సురేష్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీదేవి మహంకాళమ్మ అమ్మవారి రాట ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్న నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ సభ్యులు


శ్రీదేవి మహంకాళమ్మ అమ్మవారు

క్లుప్తంగా

పేదలకు దుస్తులు పంపిణీ


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ

అత్తిలి: దివంగత బొంతాసుబ్బారావు త్యాగధనుడని, దళితులకు ఎన్నో మేలైన కార్యక్రమాలు చేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. బుధవారం అత్తిలి చినపేటలో బొంతాసుబ్బారావు జ్ఞాపకార్థం, దళితనాయకుడు బొంతా బాలగంగాధర్‌తిలక్ 60 మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సత్యనారాయణ చేతులమీదుగా దుస్తులు అందజేసారు. బాలగంగాధర్ తిలక్ చేస్తున్న సేవలు మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ డైరెక్టర్ రాయుడు ధర్మారావు, చవ్వాకుల భరత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నూకపెయి రామకృష్ణ, బొంతా చిట్టిమరియమ్మ, బొంతా మేరీరత్నం, విప్పర్తి చిట్టిబాబు, ఈడూరి శ్యాంబాబు, ఇంజే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అత్తిలి: బాలికలు పౌష్టికాహారం భుజించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యసమస్యలు తలెత్తవని అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డా. కె నాగరాజు చెప్పారు. బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యులు, విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేసారు. బాలబాలికలకు రక్తపరీక్షలు, హెమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. పిల్లలకు వచ్చే జలుబు, దగ్గు వంటి వాటికి మందులు పంపిణీ చేసారు. బాలికలలో అనారోగ్య కారణాల వల్ల పాఠశాలకు తరచు మానివేయడం, చదువులో వెనుకబడి ఉంటడం వంటి విషయాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ వైద్యబృందం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం వీరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఆశా కార్యకర్త మల్లేశ్వరి పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం


వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవీ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పడాల వృద్ధాశ్రమంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం, బిస్కెట్స్, స్నాక్స్ అందజేశారు. వక్తలు మాట్లాడుతూ వృద్ధ తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్చవద్దని వారి పిల్లలకు విజ్ఞప్తి చేశారు. పిల్లలకు సరైన కౌన్సిలింగ్ ఇచ్చే విధంగా ప్రతి ఒక్కరు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నున్న బాలత్రిపుర సుందరరావు, గుప్తా, రంగనాయకులు, చీమకుర్తి రాజశేఖర్, పసుమర్తి అనిల్, కోశాధికారి మండ పవన్, వీర నాగసూరి కుమారి పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించాలి

అత్తిలి: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రామన్నపేటలో గల రిటైర్డు ఎంప్లాయిస్ భవనంలో లైఫ్ సర్టిఫికెట్స్ జీవన ప్రమాణం ద్వారా తీసుకుంటున్నామన్నారు. పెన్షనర్లు తమ ఆధార్‌కార్డు, మొబైల్‌ఫోన్ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

నేడు పింఛన్‌లు, రేషన్‌కార్డులు పంపిణీ

అత్తిలి: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్‌లు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్రపౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు హాజరై, లబ్ధిదారులకు పింఛన్‌లు, రేషన్‌కార్డులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ముఖ హాజరు తప్పనిసరి

యలమంచిలి: ప్రతి ఉద్యోగి సమయం తప్పకుండా తాను పని చేస్తున్న ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో ముఖ హాజరు తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ చివటం త్రిశూల పాణి కోరారు.

యూసీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

తణుకు టౌన్: తణుకు మండల యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ (యూసీఏ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కార్యదర్శి కే బ్లెస్సింగ్ రాజు తెలిపారు. బుధవారం తణుకులో జరిగిన నూతన కార్యవర్గం సమావేశంలో యూసీఏ అధ్యక్షుడు ఓ మనోజ్ బాబ్, ఉపాధ్యక్షుడిగా కోటిపల్లి లాజరస్ బాబు, కార్యదర్శిగా కే బ్లెస్సింగ్ రాజు, సహాయ కార్యదర్శిగా కేఎస్ రాజు, కోశాధికారిగా కే డేవిడ్ బాబు, సహాయ కోశాధికారిగా జీ జయన్న, కోఆర్డినేటర్‌గా ఐజాక్ బ్రెన్‌హాం, కార్యవర్గ సభ్యులుగా ఎస్ కృపావరం, జోషఫ్, డి వర్మ ఎన్నికైనట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు డాక్టర్ కే ఆనంద్, నటరాజన్ లాజరస్‌లు పాల్గొని యూసీఏ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో యూసీఏ గౌరవ అధ్యక్షులు ఎం జోహన్నెస్‌ప్రేమ్‌కుమార్, జీఎస్ హానోక్, జగ్గీవన్ తదితరులు పాల్గొన్నారు.


యూసీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కనులపండువగా శ్రీనివాస కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేట–కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మతల్లి వార్షిక మహోత్సవాలను యువఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి అమ్మవారి మందిరం వద్ద ద్వారకా తిరుమల దేవస్థానం వారిచే శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. నిర్వాహకులు రాజా త్రినాథ్ నేతృత్వం వహించారు.

నేడు పుంతలో ముసలమ్మ మందిరం వద్ద రథోత్సవం

మందిరం వద్ద 5వ తేదీ గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఊరేగింపును విజయవంతం చేయాలని, భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.


మందిరం వద్ద పూజల్లో పాల్గొన్న రాజా త్రినాథ్ తదితరులు

ఆంజనేయస్వామిని దర్శించుకున్న యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి వారిని బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నేత కొట్టు విశాల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, ఆలయ నిర్మాణకర్త మట్టా సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.


పెదతాడేపల్లి ఆంజనేయస్వామి దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్

సీసలిలో రైతుల రాస్తారోకో

కాళ్ల: రైతు భరోసా కేంద్రం ద్వారా అమ్మిన ధాన్యాన్ని రంగు మారిందంటూ మిల్లు యాజమాన్యం తిరస్కరించటాన్ని వ్యతిరేకిస్తూ కాళ్ల మండలం సీసలి గ్రామం వద్ద రాష్ట్రీయ రహదారిపై ఆకివీడు మండలం చెరుకుమిల్లి రైతులు బుధవారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. చెరుకుమిల్లికి చెందిన వేగేశ్న శ్రీనివాసరాజు, పెద్దింటి జగన్మోహన్, పాటూరి శ్రీను, భలే కిచెన్ తదితరులు సుమారు 350 బస్తాల ధాన్యం లారీపై సీసలి రైస్ మిల్లుకు ఐదు రోజుల కిందట తీసుకొచ్చారు. రైస్‌మిల్ యజమాని ధాన్యం రంగు మారిందనే సాకుతో బస్తాకు రూ.వెయ్యికి మించి ధర చెల్లించడానికి ముందుకు రాకపోవడంతో రైతులు రాస్తారోకో చేపట్టారు. ఘటనస్థలికి చేరిన ఎస్సై మల్లికార్జున్ రెడ్డి సూచనలతో రైస్‌మిల్ ప్రాంగణంలో రైతులు, నాయకులు బైఠాయించారు. రైస్ మిల్లర్‌తో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, తహసీల్దార్ కృష్ణారావు, ఎస్సై మల్లికార్జున్ రెడ్డి తదితరులు చర్చించారు. దీంతో ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకు అధికారులు అంగీకరించారు. లారీ వెయిటింగ్ చార్జీలో రూ.20 వేలు రైస్ మిల్లర్, మిగిలిన రూ.10 వేలు రైతులు భరించేలా ఒప్పందం చేశారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు.


సీసలిలో రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేస్తున్న దృశ్యం

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

మొగల్తూరు: విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి సూచించారు. బుధవారం కాళీపట్నం ఓరియంట్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాళీపట్నం, పాతపాడు, జగన్నాథపురం, నీటితిప్ప పాఠశాలలకు చెందిన 8వ తరగతికి చెందిన 112 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవురు సావిత్రి, వైస్ ఎంపీపీ కవురు సీతామహాలక్ష్మి, సొసైటీ చైర్మన్‌లు అల్లూరి రంగరాజు, దొంగ నాగముని, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కంశెటి ఏడుకొండలు, కవురు ఆదినారాయణ, కవురు సుబ్రహ్మణ్యం, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంఈఓ పుష్పరాజ్యం, పాఠశాల హెచ్ఎం జి.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కాళీపట్నం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

పెనుమంట్ర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని నవరత్నాల ద్వారా 9 పథథలు అమలే కాకుండా 34 స్కీములను లబ్ధిదారులకు అందజేస్తున్నారని జిల్లా అభివృద్ధి అధికారి సీహెచ్ అప్పారావు అన్నారు. బుధవారం పెనుమంట్ర గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ఏడాదిలో రెండు పర్యాయాలు మాత్రమే పంచాయతీలో గ్రామసభలు జరిగేవని, ప్రస్తుత ప్రభుత్వంలో నాలుగు పర్యాయాలు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు గ్రామసభలు నిర్వహించి మూడు నెలలలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని చర్చించడమే కాకుండా గ్రామస్తుల తెలిపిన వివిధ సమస్యలపై చర్చించి పరిష్కారానికి గ్రామసభలలో చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ప్రతి పాఠశాలలోనూ అంగన్‌వాడీ సెంటర్‌లలోను బాలబాలికలు వేరువేరుగా టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీలలో ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నామని, కనీసం పదేళ్లకు ఒకసారైనా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి, ఉప సర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యుడు గండి రామారావు, కార్యదర్శి ఎస్. నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.